

## జోరుగా వరి నాట్లు

ఈ ఏడాది నైరుతి రుతు పవనాలు ముందుగానే రాష్ట్రంలోకి ప్రవేశించడంతో రైతులు వ్యవసాయ పనుల్లో మునిగిపోయారు. ఈక్రమంలోనే నిజామాబాద్ జిల్లా చందూర్ మండలంలో వరి నారుమళ్లు, ఇతరత్రా పనుల్లో బిజీబిజీగా ఉన్న రైతులు.



## ఎరువుల కోసం పాట్లు

నిర్మల్ జిల్లా బాసర పీఏసీఎస్ ఎదుట మంగళవారం రైతులు ఎరువుల కోసం బారులుదీరారు. 12 గ్రామాలకు చెందిన 300 మందికిపైగా రైతులు ఎండ వేడిని భరించలేక తమ పాదరక్షలను క్యూలో పెట్టారు. సొసైటీలో 400 డీఏపీ బస్తాలు ఉండగా.. ఒక్కో రైతుకు ఐదు చొప్పున పంపిణీ చేశారు. 100మందికిపైగా కర్షకులు ఎరువులు దొరక్క వెనుదిరిగారు. ఈసీజన్‌లో ఎరువులను అందుబాటులో ఉంచకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

## కాళేశ్వరంపై కాంగ్రెస్ క్షుద్ర రాజకీయాలు

- కేసీఆర్‌కు నోటీసులివ్వడాన్ని నిరసిస్తూ ఆందోళన
- నేడు తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో మహాధర్నా
- ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం కమిషన్ పేరుతో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం క్షుద్ర రాజకీయాలు కొనసాగిస్తున్నదని ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కాళేశ్వరంపై ఏర్పాటుచేసిన కమిషన్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈధర్నా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరానున్నట్టు పేర్కొన్నారు. ప్రాణహిత-చేవెళ్లను కాళేశ్వరం ప్రాజెక్టుగా ఎందుకు రీడిజైన్ చేయాల్సి వచ్చిందని, కాళేశ్వరం అందుబాటులోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి కలిగిన ప్రయోజనాలు, కల్పతరువు లాంటి కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం పడావు పెట్టడంతో రాష్ట్ర రైతాంగానికి జరుగుతున్న నష్టం తదితర అంశాలపై ధర్నాలో ముఖ్య వ్యక్తులు మాట్లాడుతారని పేర్కొన్నారు.

## తాజా అప్పు రూ.1500 కోట్లు

- ఆర్బీఐ ఈ-వేలం ద్వారా సేకరించిన ప్రభుత్వం
- రెండున్నర నెలల్లోనే రూ.10,400 కోట్ల రుణం



హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి భారీ ప్రాజెక్టులు చేపట్టకపోయినా అప్పుల పరంపరను కొనసాగిస్తున్నది. భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) నుంచి తాజాగా మరో రూ.1,500 కోట్ల రుణం తీసుకున్నది. మంగళవారం నిర్వహించిన ఈ-వేలం ద్వారా సెక్యూరిటీ బాండ్లు పెట్టి ఈ రుణం సేకరించినట్టు ఆర్బీఐ ప్రకటించింది. 19 ఏండ్లకాల పరిమితికి 6.92శాతం వార్షిక వడ్డీతో రూ.800 కోట్లు, 20 ఏండ్ల కాల పరిమితికి 6.92శాతం వార్షిక వడ్డీతో రూ.700 కోట్లు సమీకరించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.14 వేల కోట్ల రుణం కోసం ఆర్బీఐకి రేవంత్ సర్కారు ప్రతిపాదనలు పంపింది. అందులో భాగంగా ఏప్రిల్‌లో మూడు దఫాల్లో రూ.4,400 కోట్లు, మే నెలలో రెండు దఫాల్లో 4,500 కోట్లు అప్పు తీసుకున్నది. తాజా రుణం రూ.1,500 కోట్లు కలిపి రెండున్నర నెలల్లో రూ.10,400 కోట్లు సమీకరించినట్టయింది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం మార్కెట్ రుణాల కింద రూ.64,539 కోట్లు సమీకరిస్తామని బడ్జెట్‌లో ప్రతిపాదించారు.

## కర్మాగారాల్లో భద్రతా ప్రమాణాలపై రాజీవద్దు

**ఫ్యాక్టరీలశాఖ డైరెక్టర్ బీ రాజగోపాల్‌రావు**

హైదరాబాద్, జూన్ 3(నమస్తే తెలంగాణ): కర్మాగారాల్లో భద్రతా ప్రమాణాలపై రాజీ పడొద్దని ఫ్యాక్టరీలశాఖ డైరెక్టర్ బీ రాజగోపాల్‌రావు సూచించారు. కెమికల్, ఫార్మా కంపెనీల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు పాటించడం ద్వారా చాలా ప్రమాదాలను నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఫ్యాక్టరీలశాఖ, నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ సంయుక్తాధ్వర్యంలో మంగళవారం 'కెమికల్, ఫార్మాస్యూటికల్ ఫ్యాక్టరీల్లో భద్రత' అంశంపై ఎఫ్‌టీసీసీఐలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ భద్రతలో ప్లానింగ్, డిజైన్, పరికరాల నిర్వహణ, కార్మికులకు శిక్షణ తదితర అంశాలు ఎంతో ప్రధానమని చెప్పారు. ముడిసరుకు సేకరణ దగ్గర్నుంచి, దాన్ని డిస్పోజల్ చేసేవరకు అన్ని దశల్లో ఫ్యాక్టరీల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరారు.

## తెలంగాణకు భారీగా ఉల్లి దిగుమతి

హైదరాబాద్, జూన్3 (నమస్తేతెలంగాణ): తెలంగాణకు పొరుగు రాష్ట్రాల నుంచి ఉల్లిగడ్డ భారీగా దిగుమతి అవుతున్నది. రాష్ట్రంలో అతి పెద్దదైన హైదరాబాద్‌లోని మలక్‌పేట గంజి మార్కెట్‌కు సోమవారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో ఉల్లిగడ్డ దిగుమతి అయింది. 141 లారీల ఉల్లి దిగుమతి కాగా, మహారాష్ట్ర నుంచే అత్యధికంగా 105 లారీల ఉల్లిగడ్డ వచ్చిందని మార్కెటింగ్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం హోల్‌సేల్ మార్కెట్‌లో ఉల్లి క్వింటాకు రూ.1,500 నుంచి రూ.1,800గా పలుకుతున్నది. మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు.

## ఇంటర్‌లో కంప్యూటింగ్, బిగ్ డాటా అనాలసిస్

**రాష్ట్రంలోని ఆరు ఇంటర్ కాలేజీల్లో కొత్త కోర్సులు**

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): క్లౌడ్ కంప్యూటింగ్.. బిగ్ డాటా అనాలసిస్.. ఏఐఎంఎల్, బయో మెడికల్ ఇంజినీరింగ్. ఈ కోర్సులన్నీ బీటెక్‌లో ఉండేవే. ఇంటర్ పూర్తయిన తర్వాత ఈ కోర్సుల్లో చేరే అవకాశముంటుంది. కానీ ఇక నుంచి ఇంటర్మీడియట్ స్థాయిలోనే ఈ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. ఇలాంటి ఆరు కొత్త కోర్సులను 2025-26 విద్యాసంవత్సరంలో ఇంటర్ విద్యా కమిషనరేట్ అధికారులు సర్కారు జూనియర్ కాలేజీల్లో ప్రవేశపెడుతున్నారు. కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కీలకమైన క్లౌడ్ కంప్యూటింగ్ అండ్ బిగ్ డాటా అనలిసిస్ కోర్సును ప్రవేశపెట్టనున్నారు. ఫలక్‌నుమాలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్(ఏఐఎంఎల్), నల్లగొండ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కాలేజీలో బయోమెడికల్ ఇంజినీరింగ్, మహబూబ్‌నగర్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కాలేజీలో ఎలక్ట్రానిక్స్ అండ్ వీడియో ఇంజినీరింగ్, హనుమకొండ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కాలేజీలో ఎంబెడెడ్ సిస్టమ్స్, బజార్‌ఘాట్(హైదరాబాద్) ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కాలేజీలో సైబర్ ఫిజికల్ సిస్టమ్ అండ్ సెక్యూరిటీ కోర్సు ప్రవేశపెట్టాలని నిర్ణయం తీసుకున్నారు.

## 23 ఐఐటీల్లో ఓపెన్‌హౌజ్

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : ఐఐటీల్లోని సీట్లను భర్తీచేసే జోసా-2025 రిజిస్ట్రేషన్ ప్రారంభమైన నేపథ్యంలో దేశంలోని మొత్తం 23 ఐఐటీలు ఓపెన్ హౌజ్‌లను నిర్వహిస్తున్నాయి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతుల్లో డోర్లు తెరిచాయి. విద్యార్థులు స్వయంగా వీక్షించుకుని ఏ ఐఐటీల్లో చేరాలో నిర్ణయించుకునే అవకాశాన్ని విద్యార్థులకు అందిస్తున్నాయి. ఇటీవల మన దగ్గర ఐఐటీ క్రేజ్ తారాస్థాయికి చేరింది. కొత్త ఐఐటీలు ఏర్పాటుకావడం, సీట్లు గణనీయంగా పెరగడంతో చాలా మంది ఐఐటీల్లో కాలు పెడుతున్నారు. దీంతో ఐఐటీ బాంబే, ఖరగ్‌పూర్ మద్రాస్ వంటి ప్రఖ్యాత సంస్థలు కూడా ఓపెన్‌హౌజ్‌ను నిర్వహిస్తున్నాయి. బుధ, గురువారాల్లో ఐఐటీ హైదరాబాద్‌లో ఓపెన్‌హౌజ్ నిర్వహించనున్నారు. బుధవారం ఆఫ్‌లైన్‌లో నిర్వహించనుండగా, గురువారం ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహిస్తారు.

## నా ఆస్తులను కబ్జా చేశారు

**టీడీపీ నేత పత్తిపాటిపై పార్టీ ఎన్‌ఆర్‌ఐ సెల్ సభ్యుడి ఆరోపణ**

ఖైరతాబాద్, జూన్ 3: ఆంధ్రప్రదేశ్ టీడీపీ నేత, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, అతని అనుచరులు కలిసి తన ఆస్తులను కబ్జా చేశారని ఆ పార్టీ ఎన్‌ఆర్‌ఐ సెల్ సభ్యుడు రావి మురళీమోహన్ ఆరోపించారు. మంగళవారం ఆయన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఏపీలోని చిలకలూరిపేటలో తనకు 'సాయికార్తీక్ సిటీ సెంటర్' పేరుతో షాపింగ్ కాంప్లెక్స్ ఉన్నదని, అందులో రెండు థియేటర్లు, ఫంక్షన్ హాళ్లు, రెండు అంతస్తుల వాణిజ్య సముదాయాలు ఉన్నాయని, వాటి విలువ సుమారు రూ.69 కోట్ల వరకు ఉంటుందని వివరించారు. తాను 20 ఏండ్లుగా అమెరికాలో ఉండటంతో పత్తిపాటి పుల్లారావు, అతని అనుచరులు ఆ షాపింగ్ కాంప్లెక్స్ మొత్తాన్ని అక్రమంగా తమ ఆధీనంలోకి తీసుకున్నారని తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్లు అర్హులకు ఇవ్వరా?

- కాంగ్రెస్ ఎమ్మెల్యేను నిలదీసిన సొంత పార్టీ కార్యకర్తలు
- అర్హులైన తమకు ఇందిరమ్మ ఇళ్లు రాలేదని మండిపాటు
- రీ సర్వే చేయాలని డిమాండ్

ఐనవోలు, జూన్ 3 : ఇందిరమ్మ ఇండ్ల మంజూరుపై సొంత పార్టీ నాయకులే వర్ధన్నపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును నిలదీశారు. అర్హులైన తమకు ఇందిరమ్మ ఇళ్లు రాలేదంటూ మండిపడ్డారు. మంగళవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ ప్రావీణ్య, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ క్రమంలో అర్హులైన తమకు ఇళ్లు రాలేదంటూ ఎమ్మెల్యే నాగరాజును కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిలదీశారు. అర్హులకు కాకుండా పక్కా ఇళ్లు, భూములున్న వారి పేర్లు ఇందిరమ్మ ఇళ్ల లిస్టులో రావడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. నిజమైన లబ్ధిదారుల ఎంపిక కోసం రీ సర్వే చేయాలని డిమాండ్ చేశారు.



హనుమకొండ జిల్లా ఐనవోలులో ఎమ్మెల్యే నాగరాజును నిలదీస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు



తన పేరు తీసేశారంటూ కంటతడి పెట్టుకుంటున్న కక్కిరాలపల్లికి చెందిన రజిత

**బతుకుదెరువుకుపోతే లిస్టులో పేరు తీసేశారు**

గ్రామంలో ఉండేందుకు మాకు ఇల్లు లేదు. బతుకుదెరువు కోసం కుటుంబసభ్యులందరం కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నాం. మాకు సంబంధించిన అన్ని ఆధారాలు కక్కిరాలపల్లి ఊరు పేరు మీదే ఉన్నాయి. ఇక్కడ నివాసం ఉండడం లేదని, ఎవరో కావాలనే ఇందిరమ్మ ఇండ్ల లిస్టులో నుంచి పేరు తీసేశారు' అంటూ కక్కిరాలపల్లికి చెందిన తూళ్ల రజిత కంటతడి పెట్టిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

*- తూళ్ల రజిత, కక్కిరాలపల్లి, ఐనవోలు, హనుమకొండ జిల్లా*

## అక్రమ నిర్మాణం అడ్డగింత

**మున్సిపల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే పీఏ బెదిరింపు కాల్**

అమరచింత, జూన్ 3 : వనపర్తి జిల్లా అమరచింత మున్సిపాలిటీలో ఓ వ్యక్తి పురపాలిక అనుమతి లేకుండా ఇంటి నిర్మాణ పనులు చేయడంతోపాటు డ్రైనేజీని సైతం ఆక్రమించుకోవడంతో మున్సిపల్ కమిషనర్ ఆ పనులు అడ్డుకోగా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పీఏ వెంకటేశ్ ఫోన్ చేసి బెదిరించిన ఘటన మంగళవారం చోటు చేసుకున్నది. మున్సిపల్ కమిషనర్ రవిబాబు తెలిపిన వివరాల ప్రకారం .. మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డులో తోకలి శంకర్ మున్సిపల్ అధికారుల అనుమతి లేకుండా ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించాడు. రోడ్డు పక్కన ఉన్న డ్రైనేజీని సైతం కూల్చి అందులో పిల్లర్ వేసి పనులు చేపడుతుండడంతో గతంలోనే మున్సిపల్ అధికారులు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. దీంతో పనులు నిలిపివేసిన యజమాని కూల్చివేసిన డ్రైనేజీపై మళ్లీ రెండు ఫీట్ల వరకు గోడ నిర్మించడంతో మున్సిపల్ కమిషనర్ సిబ్బందితో కలిసి వెళ్లి కాలనీవాసులకు ఇబ్బంది కలిగేలా ఉన్న నిర్మాణాన్ని ఆపాలని సూచించారు. దీంతో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పీఏ వెంకటేశ్ అక్కడే తనకు ఫోన్ చేసి 'తమ అనుమతి లేకుండా అక్కడికి ఎందుకు వెళ్లావని, తక్షణమే అక్కడినుంచి వెళ్లకపోతే ట్రాన్స్‌ఫర్ చేయిస్తానని ఫోన్‌లో బెదిరించారని' కమిషనర్ పేర్కొన్నారు.

# ఇథనాల్ ఫ్యాక్టరీ మాకొద్దు

**రాజోళి మండల రైతుల నిరసన • పెద్ద ధన్వాడ వద్ద ఆందోళన**

రాజోళి, జూన్ 3 : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండల పెద్ద ధన్వాడ శివారులో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై రైతులు దండయాత్ర చేస్తున్నారు. కంపెనీ యాజమాన్యం సోమవారం అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా కంటైనర్, జేసీబీలు, కొందరు ప్రైవేటు సిబ్బందిని దింపి పనులు చేయడంతో మంగళవారం ఉదయం గమనించిన రైతులు పెద్ద ఎత్తున చేరుకొని ఫ్యాక్టరీ నిర్మించే రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఫ్యాక్టరీ అనుమతులను వెంటనే రద్దు చేయాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాటే కంపెనీలకు అధికారులు సహకరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. మూడు గంటలపాటు నిరసన తెలియజేసినా ఎవరూ స్పందించకపోవడంతో త్వరలోనే ఫ్యాక్టరీని అడ్డుకునేందుకు కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పి అక్కడి నుంచి రైతులు వెళ్లిపోయారు.



జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండలం పెద్దధన్వాడ శివారులో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేస్తున్న వివిధ గ్రామాల రైతులు

# గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు మాకెందుకు?

- రేడియల్ రోడ్డు ప్లాన్ మార్చండి
- గ్రీన్‌ఫీల్డ్ భూబాధితుల డిమాండ్
- కొంగరకలాన్‌లో ప్రజాభిప్రాయ సేకరణ.. హాజరైంది ఏడుగురే!

ఆదిభట్ల, జూన్ 3: 'గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు ఏర్పాటుతో భూములు పూర్తిగా పోతున్నాయని, రోడ్డు ప్లాన్ మార్చాలని' 100 మీటర్ల గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డులో భూములు కోల్పోతున్న భూబాధితులు డిమాండ్ చేశారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్‌లో గ్రీన్‌ఫీల్డ్ రోడ్ ప్రాజెక్ట్‌పై రావిర్యాల ఎగ్జిట్ 13 నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు ఫేజ్-1 రోడ్డును 18.5 కిలోమీటర్ల పొడువులో ఏర్పాటు చేసేందుకు భూ సేకరణ, పరిహారం, పునరావాసం, ఉపాధి కల్పన కోసం కొంగరకలాన్, ఫిరోజ్‌గూడ గ్రామాల రైతులతో రెండోదఫా ప్రజాభిప్రాయ సేకరణ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా రైతులు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, భూ సేకరణ అధికారి రాజుతో తమ వాదనను తెలిపారు. భూసేకరణ అధికారి మాట్లాడుతూ భూములు కోల్పోతున్న రైతులకు పరిహారంతోపాటు ప్రభుత్వం ప్రత్యేకంగా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద ఉద్యోగం, రూ.5 లక్షల 50 వేలు చెల్లించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు ఏర్పాటు లో కొంగరకలాన్, ఫిరోజ్‌గూడకు చెందిన 30మంది రైతుల భూములు కోల్పోతున్నారు. కానీ ప్రజా అభిప్రాయ సేకరణలో ఏడుమంది రైతులే పాల్గొన్నారు.



కొంగరకలాన్‌లో ప్రజాభిప్రాయ సేకరణలో రంగారెడ్డి జిల్లా భూసేకరణ అధికారి రాజు

## అప్పుల బాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య

- తన అప్పుతో పాటు తమ్ముడి అప్పు తీర్చలేక ఆదిలాబాద్ జిల్లాలో రైతు బలవన్మరణం
- పంట దిగుబడి రాక ఖమ్మం జిల్లాలో మరో రైతు..



పులాజీరాం(ఫైల్)

రఘునాథపాలెం/ ఉట్నూర్ రూరల్, జూన్ 3: అప్పుల బాధ తాళలేక ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం శంభుగూడకు చెందిన రైతు సెడ్మకి పులాజీరాం(45) తనకున్న రెండెకరాలతోపాటు మరో మూడెకరాలు కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నాడు. పెట్టుబడి కోసం రూ.3 లక్షల వరకు అప్పుచేశాడు. దీనికి తోడు మూడు నెలల క్రితం తన తమ్ముడు సెడ్మకి బాదిరావు ఆత్మహత్య చేసుకోగా.. అతడు చేసిన అప్పులు రూ.2లక్షలు ఉంది. దీంతో అప్పు ఎలా తీర్చాలనే బెంగతో సోమవారం తన చేను వద్దకు వెళ్లి పురుగుల మందుతాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఉట్నూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం చిమ్మపూడికి చెందిన పరిమిశెట్టి వీరబాబు (55) వ్యవసాయమే జీవనాధారంగా కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తనకున్న మూడెకరాలకు తోడు మరికొంత భూమిని కౌలుకు తీసుకొని పత్తి, మిర్చి సాగుచేశాడు. పంట పెట్టుబడి కోసం కొంత అప్పు చేశాడు. ఈక్రమంలో ఆశించిన దిగుబడి రాలేదు. దీంతో చేసిన అప్పులు తీర్చలేక మనోవేదనకు గురైన వీరబాబు సోమవారం రాత్రి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

## రైతు భరోసా కోసం ధర్నా




రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్ మాట్లాడుతూ 2024 వానకాలం పంటకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో చేరుతున్నామని ముఖ్యమంత్రి ప్రకటించినప్పటికీ.. 2024-25లో ప్రీమియం చెల్లించకపోవడం వల్ల రైతు బీమా పరిహారం తెలంగాణకు రాలేదని ఆరోపించారు. - ఖిలావరంగల్

## తాగునీటి కోసం..ట్యాంక్ ఎక్కి



ఓవైపు వర్షాలు కురుస్తున్నా పలు చోట్ల తాగునీటికి జనం తండ్లాడుతున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ కొత్తకాలనీ వాసులు ఏకంగా వాటర్‌ట్యాంక్‌పైకి ఎక్కి నీళ్లు తెచ్చుకున్నారు. సోమవారం మిషన్ భగీరథ వాటర్ ప్లాంట్ యంత్రాలు శుద్ధి చేయడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో మంగళవారం నీళ్ల కోసం స్థానికులు ఓవర్ హెడ్ ట్యాంక్ ఎక్కి అడుగున ఉన్న కొద్దిపాటి నీటిని తెచ్చుకున్నారు. -ధరూరు.

## డబుల్ బెడ్‌రూం బాధితుల ఆందోళన

- తమకు కేటాయించినవి తమకే ఇవ్వాలని బాధితుల డిమాండ్
- ఇండ్ల ముందు ధర్నా.. వంటావార్పు

హనుమకొండ, జూన్ 3: హనుమకొండ అంబేద్కర్‌నగర్ వద్ద డబుల్ బెడ్‌రూం బాధితులు ఆందోళన చేపట్టారు. తమకు కేటాయించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను తమకే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సాయంత్రం తాళాలు పగులగొట్టి ఇంటి లోపలికి వెళ్లారు. అక్కడే వంట చేసుకుని పడుకొన్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గత ప్రభుత్వం 2015లోనే అంబేద్కర్‌నగర్‌లో 53 మందికి, జితేందర్‌నగర్‌లో 64 మందికి ప్రొసీడింగ్స్ ఇచ్చినా అధికారులు ఇప్పటివరకు ఇండ్లు కేటాయించలేదని ఆగ్రహంవ్యక్తంచేశారు. పదేళ్లుగా గుడిసెల్లో చెత్త డంపింగ్ యార్డు పక్కన ఉంటున్నామని ఆవేదన వెలిబుచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే అర్హులైన నిరుపేదలకు ఇళ్లు ఇస్తామని చెప్పి, ఇవ్వడం లేదని వాపోయారు. సుబేదారి పోలీసులు చేరుకొని బాధితులతో మాట్లాడినా వినకుండా అధికారులు, ఎమ్మెల్యే వచ్చే వరకు ఇక్కడే ఉంటామని భీష్మించుకొని కూర్చున్నారు. బుధవారం నుంచి మరింత ఉధృతం చేస్తామని స్పష్టంచేశారు.



హనుమకొండలోని అంబేద్కర్ నగర్ వద్ద వంటలు చేసుకుంటున్న బాధితులు

## ఎస్సీ గురుకులాల కార్యదర్శిపై ఫిర్యాదు

కవాడిగూడ, జూన్ 3: ఎస్సీ గురుకుల విద్యార్థులపై వివక్షపూరిత వ్యాఖ్యలు చేసిన ఎస్సీ గురుకులాల కార్యదర్శి డాక్టర్ వీఎస్ అలుగు వర్షిణిపై హైదరాబాద్ గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీఆర్పీఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఆమెపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులను సమానంగా చూడాల్సిన అధికారి ఇలా వ్యాఖ్యానించడం బాధాకరమని అన్నారు.

## భూమి పోతున్నదని ఆగిన గుండె

- రైతును మింగిన ట్రిపుల్ ఆర్
- న్యాయం కోసం రోడ్డెక్కిన కుటుంబసభ్యులు



భిక్షపతి (ఫైల్)

మర్కూక్, జూన్ 6 : 'ఉన్న భూమి ట్రిపుల్ ఆర్‌లో పోవట్టె!' అంటూ బెంగపడిన రైతు చివరికి గుండెపోటుతో మృతిచెందిన ఘటన సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం నర్సన్నపేటలో చోటు చేసుకున్నది. నర్సన్నపేటకు చెందిన దివ్యాంగుడైన ఎంబరి భిక్షపతి (42) గ్రామ పరిధిలో తనకున్న ఎకరం పొలంలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భిక్షపతికి నాలుగు రోజుల కిందట అధికారులు భూసేకరణకు సంబంధించి నోటీసును అందించారు. బహిరంగ మార్కెట్‌లో ఎకరం భూమి రూ.కోటి ధర పలుకుతుంటే, ప్రభుత్వం పరిహారంగా రూ.8 లక్షలు మాత్రమే ఇస్తామని నోటీసులో పేర్కొన్నది. దీంతో రెండురోజులుగా మనోవేదనతో బాధపడుతూ సోమవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. దీంతో ఆ కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్థులు మంగళవారం భిక్షపతి మృతదేహంతో రోడ్డుపై రాస్తారోకో చేశారు.

## ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

**ఫ్రీ బస్సు పథకంతో ఉపాధి పోయింది**



డ్రైవర్ శేఖర్

శివ్వంపేట, మే 3 : అప్పులు పెరిగి మనోవేదనకు గురైన ఆటోడ్రైవర్ సెల్ఫీ తీసుకుంటూ పురుగుల మందు తాగిన ఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలం కొత్తపేటలో చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన కంచాన్‌పల్లి శేఖర్ అవసరాల కోసం రూ.20లక్షల వరకు అప్పు చేశాడు. దీంతో హైదరాబాద్‌కు మూడేండ్ల క్రితం వలసవెళ్లి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకున్నాడు. కొత్తపేట మీదుగా పోతున్న ట్రిపుల్ ఆర్ రోడ్డులో 25 గుంటల వరకు శేఖర్ భూమి పోతున్నది. నష్టపరిహారం ఇస్తే తన అప్పులు తీర్చుకుందామనుకున్న శేఖర్ పరిహారం రాకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. పురుగుల మందు తాగుతూ సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.